

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(కిందటి సంచికనుంచి కొనసాగింపు)*




**మంచాలన్నీ** రోగులతో నిండివున్నాయి. పడుకున్న రోగులందరూ పైలోకానికి వెళ్లే రైల్లో బెర్తులు బుక్ చేసుకుని పడుకున్నట్టు వున్నారు. అంతా డబ్బున్న వారిలాగే వున్నారు. డబ్బున్న జబ్బున్న వారిలా కూడా వున్నారు.

'వచ్చేసినాను డ్రాటారూ' అంటూ మందాకిని, పేషెంట్‌ని పరీక్ష చేస్తున్న బాలరాజుని పలకరించింది. జూనియర్‌కి సలహాలిచ్చాక బాలరాజు 'సో హోపీ' అంటూ మందాకినిని పలకరించాడు.'

'మన కె.జి.హెచ్ కంటే యిక్కడ సందడి శానా తక్కువలాగుందండి.'

'అలాగే అనిపిస్తోంది.'

'మనకి తెలిసిన స్టాపు యింకోరన్నా తగిలారా డ్రాటారూ.'

'నో. కానీ కింద చాముండేశ్వరి అని రిసెప్షనిస్ట్ వుంది. నీలాగే అందగత్తె. నీలాగే మాట్లాడుతుంది. నీ సిస్టరంటే నమ్మేయొచ్చు. మంచి పిల్లలాగా వుంది.'

'ఆయ్. సాముండి నాకు తెల్సండి. అడపా దడపా పేసెంట్లు వచ్చినప్పుడు పరిసయం. సాయం అంటే పేనవిస్తది. మంచి గుంట.'

మధ్య మధ్యలో మాట్లాడుకుంటూ రౌండ్స్ పూర్తి చేశారు. నాగదాసు పిలుస్తున్నారని వార్డ్‌బోయ్ చెప్పాడు. బాలరాజు వెళ్లి కనిపించాడు. యమ్ ఎల్ ఏ హనూరావుగారు గాల్ బ్లాడర్ సర్జరీ కోసం ఎడ్మిట్ అవుతున్నార్ట. జాగర్తగా వ్యవహరించమని బాధ్యత అప్పగించారు. బాలరాజు. ఓ.కె అని బైటికొచ్చాడు. పేషెంటుకి డబ్బున్నా లేకపోయినా, పవరున్నా లేకపోయినా బాలరాజు ఏకాగ్రతకీ, పని తనానికే తేడా వుండదు. అందర్నీ తన సొంత మనుషుల్లానే చూస్తాడు.

కింద క్యాంటీన్లో రేఖ కనిపించింది.

'నేను నెక్స్ట్ వీక్ జాయినవుతున్నాను' అంది.

'వెరీగుడ్ గ్రేట్ న్యూస్' అన్నాడు బాలరాజు.

'ఎలావుందిక్కడ నీకు?' అడిగింది రేఖ.

'ఏదీ. యింకా అలవాటు పడుతున్నాను. సోఫార్ సో గుడ్'

"ఏవిటి ఈవినింగ్ ప్రోగ్రామ్'

'ఏవీ అనుకోలేదు. అన్నట్టు యివాళ నైట్ ఆన్ కాల్ చెయ్యాలనుకుంటా. చెక్ చేస్తా'

'ఇట్సోకె. వియి మీట్ లేటర్' అని రేఖ బై చెప్పింది.

బాలరాజు పై ఫ్లోర్‌కి వెళ్లాడు. అంతా హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఎమ్మెల్యే హనూరావుగారు ఎడ్మిట్ అయ్యారు. తను ఆయన రూముకి వెళ్లి పరిచయం చేసుకున్నాడు. హనూరావుగారు పొలిటికల్ పొగరేం చూపించకుండా పొలైట్‌గా మాట్లాడారు. కొండంత పుచ్చకాయ కూడా కత్తి పీటకు తల వొంచాల్సిందే అధికారం, దర్పం, డబ్బూ, దస్కం అన్నీ రోగానికి బానిసలే. అయినా హనూరావుగారు చికిత్సకోసం మార్పు తెచ్చుకున్నట్టు లేరు. స్వతహాగానే సౌమ్యుడనిపించేరు బాలరాజుకి.

'అయితే నా గాలిబ్లాడర్‌లో గాలి తీసేస్తే నొప్పి తగ్గిపోతుందన్నమాట' అన్నారు హనూరావు.

'గాలి బ్లాడర్ కాదు సార్. గాల్ బ్లాడర్. రాళ్ళు పేరుకున్నాయి. ఆపరేషన్ చేశాక సమస్యేం వుండదు' బాలరాజు చెప్పాడు.

'ఈ పాలిటిక్స్‌లో బతకాలంటే గుండె రాయి చేసుకోవాలంటారు. కానీ నేను కడుపు రాయి చేసుకున్నానన్నమాట' నవ్వాడు.

బాలరాజు కూడా నవ్వు కలిపాడు. హనూరావుగారికి ప్రీ ఆప్ చెక్స్ చేసి, మర్నాడుదయం నిల్‌బై మౌత్ వుండాలని చెప్పి కదిలాడు.

సాయంత్రం దాటింది. దీపాలు వెలిగాయి. రిసెప్షన్‌లో చాముండేశ్వరి యింకా యింటికి వెళ్లలేదు. బాలరాజు వార్డులో పని పూర్తిచేసుకుని, డ్యూటీ రూమ్‌కి వచ్చి ముఖం కడుక్కుని కాస్త ఫ్రెష్ గా తయారయి కిటికీలోంచి దీపాల్తో విరివిగా వెలుగుతున్న విశాఖ నగరాన్ని చూశాడు. అతనికి బేస్ మెంట్‌లో తాళం వేసున్న హాల్‌లో ఏముందో తెలుసుకోవాలనే తహ తహ తగ్గలేదు. క్రిందకి వెళ్లాడు.

'డ్యూటీ అయిపోలేదా?' అని చాముండేశ్వరిని అడిగాడు.

'ఇయాల వోవరు టయివు సేత్తున్నానండి' చాముండేశ్వరి నవ్వుతూ చెప్పింది.

'దా. కాఫీ తాగుదాం' పిలిచాడు బాలరాజు.

రిసెప్షన్ చూసుకోమని మరో కుర్రాడికి అప్పచెప్పి 'పదండి' అంది. ఇద్దరూ క్యాంటీన్‌కి నడిచారు. ఇద్దరూ కూచున్నాక చాముండేశ్వరి అడిగింది. 'ఎలాగుంది డాట్రారూ యీడ? ఆ కె.జి.ఎచ్ కన్నా యిక్కడ సుకవేనండి. పేసెంట్లు తక్కువ కదాండి మరి. అంచాత.'

'నిజమే అన్నట్టు గుర్తొస్తోంది. కె.జి.హెచ్ నుండి యీ మధ్యనే ముగ్గురో నలుగురో పేషంట్స్ యిక్కడికి స్పెషల్ ట్రీట్‌మెంట్ కోసం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. వాళ్ల ముఖాలు నాకు బాగా గుర్తు. పైన వార్డులో వాళ్లు కనబడలేదు,

'పేర్లేవన్నా తెలుసాండీ.'

'గుర్తుపెట్టుకోలేదు.'

'పేర్లు తెలీపోతే కట్టవండి. అయినా పైకెల్లిపోనారేమో - సెప్పడం కట్టవండి' అంది చాము.

కాఫీ సిప్ చేస్తూ బాలరాజు అడిగాడు.

'చామూ - నాకో హెల్ప్ చైగలవా?'

'మీరడగాలా డాట్రారూ. అడగండి. పేనవిచ్చేత్తా'

'ప్రాణం వద్దులే. బేస్‌మెంట్‌లో తాళం వేసున్న హాలు ఆ రోజు చూడ్డం కుదరలేదు. అదేవిటో చూడాలని వుంది.'

'అదేదో రీచెచ్చిట. బాసెవర్నీ యెల్నివ్వడు. అక్కడెప్పుడూ సెక్యూరిటీ బాచిగాడు కాపలా. మీకోసం ఏవైనా సేత్తా. నానోసారి బాచిగాడితో రగస్సంగా బేటీ యేత్తా. నాకొదిలీండి డాట్రారూ' అని హామీ యిచ్చింది చాముండేశ్వరి.

బాలరాజు కృతజ్ఞతా పూర్వకంగా చాము చేతిని నొక్కాడు.

'అయిబాబో - బలే యేడిగా వుంది మీ సెయ్యి' అని చాము అంటూంటే ఆమె బుగ్గలు ఎర్రగా అయిపోయాయి.

'యెంటనే సెప్తా డాట్రారూ' అని హామీ యిచ్చింది చాము.

'సరే పైన కాల్సేవన్నా వుంటాయి. మళ్లీ కలుద్దాం' అని బాలరాజు లేచాడు. చాముండేశ్వరి కూడా కదిలింది.

మర్నాడు వుదయం భానురావుగారి ఆపరేషన్ పూర్తయింది. నాగదాసే చేశాడు. అంతా అనీవెంట్‌ఫుల్. పోస్టాపరేటివ్ కేర్ బాలరాజుని చూసుకోమని చెప్పాడు. భానురావు నిద్రలేచాక బాలరాజు అన్ని పరీక్షలు చేసి కాసేపు కబుర్లు చెప్పాడు. భానురావుకి బాలరాజు దేవుడిలా అనిపించాడు. రెస్టు తీసుకోండి, మళ్లీ వస్తానని చెప్పి బాలరాజు హాస్పిటల్ వదిలి తన రూమ్‌కి బైల్దేరాడు.

బాచిలర్స్ డెన్ బాల్కనీ మీద అంతా ప్రశాంతంగా వుంది. తానీషాని చూసి కొద్దిరోజులైంది. అతని టైమంతా హసీనా బేగంతోనే గడుపుతున్నట్టుగా వుంది. పాహియాన్‌ని, హిస్టరీ వర్మగారిని కలిసి కూడా కొద్దిరోజులైంది. సముద్రంకేసి చూస్తుంటే నీరు దూరంగా వున్నా బాగా లోతుగా అనిపిస్తోంది. వీచుగాలి బీచ్‌గాలి, ముఖాన్ని హాయిగా తాకుతోంది.

'బాలూ' వెనుకనుంచి పిలుపు. వెనక్కి తిరిగాడు.

'సర్ప్రైజ్' అంటూ నవ్వుతూ కనిపించింది రేఖ.

'నువ్వా! ఎప్పుడొచ్చావ్?' ఆనందాతిశయంతో అడిగాడు బాలరాజు

'యిందాకే' అంటూ దగ్గరకొచ్చి అతని మెడచుట్టూ చేతులు వేసింది. తను కాస్త తడబడ్డాడు.

'డోంట్ వర్రీ - నల్లతంబి బజారు కెళ్లాడు. చాలా ఆలస్యంగా వస్తాడు' అంది మాటల్లో కాస్త మత్తు కలిపి.

ఎన్నేళ్ల తర్వాతో కలుసుకున్న ప్రేమికుల్లా యిద్దరూ, వొకర్నొకరు కౌగిలించుకున్నారు. వాళ్లిద్దరి మధ్య సముద్రపుగాలికి వూపిరాడలేదు.

నల్లతంబి చేసిన వుప్మా యింకా వేడిగానే వుంది. ఇద్దరూ తిన్నారు. కాఫీలు తాగారు.

'సాయంత్రం యింటికి రా. మావయ్యని ప్రోపర్‌గా పరిచయం చేస్తాను.

'సీను హెవీ అవుతుందేమో.'

'అంటే.'

'అంటే -నీ స్థాయి వేరు - నా అంతస్తు వేరు. నిన్నకాక మొన్న వుద్యోగంలో చేరావ్. నీకెన్ని గుండెలు- యిలా సాగితే?'

'ఓ - అదా - అవును. మావయ్యకి అంతస్థు క్రేజు వుందని నాకు తెలుసు. ఏ జంట అయినా, పెద్దవాళ్లు వొప్పుకున్నా, వొప్పుకోకపోయినా వాళ్ల బ్రతుకు వాళ్లదే.

'తనకి నచ్చినా, నచ్చకపోయినా నువ్వు చెప్పింది నిజం. మనం ఒకట్టై వేరే వుంటాం.'

'అయితే ఓ పనిచేస్తా. నేను మావయ్యతో ముందు మాట్లాడి యీ విషయం అర్ధం అయేలా చెప్తా. ఆ తర్వాత యిద్దరం మావయ్యని కలుద్దాం.'

'జాగర్త - వుద్యోగానికి యెసరు పెట్టకుండా చూడు.'

'నోవే' - నవ్వింది రేఖ.

మర్నాడు యమ్మెల్యే భానురావ్, బాలరాజుతో చాలాసేపు మాట్లాడాడు. ఓ పట్టాన వదల్లేదు. బాలరాజంటే యెంతో యిష్టం పెంచేసుకున్నాడు. బాలరాజుకి పొలిటీషియన్స్ అంటే ప్రమాదకరమన మనుషులనే భావన వుండేది యింతకు ముందు. కానీ భాను పరిచయంతో అందరూ అలాగే వుండరనిపించింది.

'బాబూ! రోజు రోజుకీ రాజకీయ నాయకులంటే ప్రజల్లో గౌరవం బాగా తగ్గిపోతోంది. నాకు డబ్బుకు లోటులేదు. ఇంకా కావాలనే ఆశలేదు. నిష్కల్మషంగా ప్రజాసేవ చేసి నాలుగు కాలాలు వాళ్ల మనస్సుల్లో ఒక మంచి వ్యక్తిగా నిలిచిపోవాలన్నదే నా కోరిక. డాక్టర్లను చాలామందిని చూశాను. కానీ నువ్వేదో వేరు.'

'మీ అభిమానానికి ఏం చెప్పాలో తెలీడం లేదు సార్. చేసే పని బాగా చెయ్యగలగాలి. వొప్పుకున్నపని వొప్పుకున్నట్టు వొప్పుగా చెయ్యాలి. ఇది మా నాన్నగారు నూరిపోశారు. అంతేసార్' అన్నాడు బాలరాజు.

'అయామ్ సో హ్యాపీ' - అన్నాడు భానురావు.

'రేపే మీ డిశ్చార్జి' అన్నాడు బాలరాజు.

'మన పరిచయం కొనసాగుతూనే వుంటుంది డాక్టర్ బాబూ'

అంటూ బాలరాజు చెయ్యిని ఆప్యాయంగా నొక్కారు భానురావు.

'వయసులో చిన్నవాణ్ని. బాలూ అనండి చాలు' అన్నాడు బాలరాజు.

భానురావుగారు కళ్లనిండా నవ్వుతో 'ఓ.కె.బాలూ' అన్నారు.




*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments